# నమ్మకం

రాఘవాపురంలో రాము అనే మంచి పిల్లవాడున్నాడు. ఆ ఊరి బళ్లో ఏడో తరగతి చదువుతున్నాడు. రాము రోజూ బడికి వెళ్లి ఉపాధ్యాయులు చెప్పింది శ్రద్ధగా వింటాడు. బాగా ఆకళింపు చేసుకుని పరీక్షల్లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యేవాడు. రాము అంటే అందరికీ అభిమానం. అయితే ఈ మధ్య రాము ఏ పని చేయాలన్నా నాణెం తీసుకుని బొమ్మా బొరుసు వేసి చూసుకున్న తర్వాతే చేయడం మొదలెట్టాడు. దానికి ఎంతగా అలవాటు పడిపోయాడంటే, చివరికి వాళ్లమ్మ భోజనానికి పిలిస్తే వెళ్లి తినడానికి, వాళ్ల నాన్న ఏ పనైనా చెబితే అది చేయడానిక్కూడా బొమ్మా బొరుసు వేసి చూసుకుంటున్నాడు.

వార్షిక పరీక్షలు దగ్గరపడ్డాయి. మొదటి పరీక్షకి వెళ్లబోతూ... రామూ నాణెం తీశాడు. బొమ్మ పడితే పరీక్షలో ఉత్తీర్ణత, బొరుసు పడితే వైఫల్యం అనుకుని నాణెం పైకెగరేశాడు. బొరుసు పడింది. రాము గుండె జారిపోయింది.

అంతే... భోరున ఏడవడం మొదలెట్టాడు. వాళ్ల నాన్న కంగారుగా వచ్చి ఏం జరిగిందని అడిగారు. జరిగింది చెప్పి తను ఆ పరీక్షకి వెళ్లడం అనవసరమనీ, వెళ్లినా తప్పడం ఖాయమనీ ఏడవసాగాడు.

వాళ్ల నాన్న నయానా భయానా ఎన్నో రకాలుగా చెప్పి చూశారు. కానీ రాము వింటేగా! ఆయనకేమీ పాలుపోక దగ్గర్లోని ఆంజనేయస్వామి గుడికి తీసుకెళ్లారు. పూజారికి జరిగింది చెప్పారు. ఆ పూజారికి రాము బాగా తెలుసు. పెద్దవాళ్ల పట్ల మర్యాద మన్ననలు పాటించి చక్కగా చదువుకునే రాము అంటే ఆయనకీ అభిమానమే. రాము దగ్గర ఆ నాణెం తీసుకుని ఆంజనేయస్వామి పాదాల దగ్గర ఉంచారు.

'రామూ! నీకు తెలుసు కదా దేవుడి కన్నా గొప్ప వస్తువు ప్రపంచంలో లేదు. నీ చేతిలో ఉన్న ఆ నాణెం కూడా ఆ స్వామివారి ముందు ఎంత చిన్నగా ఉందో చూడు. అందుచేత ఆయనకి నేను నీ తరపున దణ్ణం పెట్టుకున్నాను. నువ్వు నిస్సంకోచంగా ఆయన మీద భారం వేసి పరీక్ష రాయి. సాయంత్రం తిన్నగా ఇక్కడికే రా. ఆ స్వామి మహిమ ఏంటో చూద్దువుగాని అని దీవించి పంపారు. రాము పరీక్షకి వెళ్లాడు.

* * *

సాయంత్రం రాము గుడిలో అయ్యగారిని కలుసుకుని 'మీరు చెప్పినట్టే పరీక్ష చాలా సులువుగా రాశాను. ఆ స్వామి దయవల్ల మంచి



మార్కులు రావడం కూడా ఖాయమండీ' అన్నాడు ఆనందంగా.

అప్పుడు ఆయన రాము వంక ప్రశాంతంగా చూసి 'చూడు రామూ! ప్రతి మనిషికీ తనమీద తనకి నమ్మకముండాలి. దేనికీ బానిస కాకూడదు. నువ్వు నాణానికి బానిసయ్యావు. నీ జీవితాన్ని శాసించడానికి అదెవరు? అనేక సమస్యలతో సతమతమయ్యే మనిషికి ప్రశాంతత నివ్వడానికే దేముడు. అంతేగాని మనిషి అంతులేని కోర్కెలు తీర్చడానికి కాదు. నువ్వు తెలివైనవాడివి కాబట్టి విషయం అర్ధమయిందని అనుకుంటున్నాను. ఇదిగో



### అన్నె సలీవన్ (1866–1936):



అన్నెకి ఐదేళ్ల వయసులోనే, ఎంతో నొప్పితో కూడిన కంటిజబ్బు సోకడంతో చూపు మందగించింది. ఎనిమిదేళ్ల వయసులో తల్లి చనిపోయింది. అన్నెని, ఆమె తమ్ముణ్నీ పెంచలేనన్న భయంతో తండ్రి పారిపోయాడు. ఓ అనాథ ఆశ్రమంలో చేరిన మూడు నెలలకే అన్నె తమ్ముడు కూడా చనిపోయాడు. అయినా ధైర్యం కోల్పోని అన్నె, బోస్టన్‌లోని అంధుల బడిలో చదువుని పూర్తిచేసింది. ఆ సమయంలోనే ఆమెకు హెలెన్ కెల్లర్‌కు విద్య నేర్పే అవకాశం వచ్చింది. చూపు, వినికిడీ లేని హెలెన్‌కు పట్టుదలతో విద్య నేర్పి గొప్ప రచయిత్రిగా తీర్చిదిద్దింది. హెలెన్‌కి బోధించేందుకు అతిగా పుస్తకాలు చదవడం వల్ల అన్నె చూపు పూర్తిగా దెబ్బతింది. భర్త నుంచి కూడా విడాకులు తీసుకోవలసి వచ్చింది. హెలన్‌తో 49 ఏళ్ల అనుబంధం తర్వాత 1936లో అన్నె చనిపోయింది.

పొద్దున నువ్విచ్చిన నాణెం' అని దేవుడి పాదాల దగ్గర నుంచి నాణెం తీసి ఇవ్వబోయారు.

అప్పుడు రాము 'ఆ నాణెం నా అజ్ఞానం. దాన్ని ఆ దేవుడి పాదాల దగ్గరే ఉంచండి. ఇంకెప్పుడూ మూఢ నమ్మకాలను పట్టించుకోను. ప్రయత్న, శ్రమలోపం లేకుండా కష్టపడతాను' అని చెప్పి వెళ్లిపోయాడు.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్.